‘అమృత’ ధార

ఇప్పటి వరకు ఎన్ని ప్రభుత్వాలు మారినా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నంద్యాల పట్టణాభివృద్ధిపై చెరిగిపోని ముద్ర వేసింది. మెడికల్ కళాశాల, జిల్లాగా తీర్చి దిద్దడం, మిర్చి మార్కెట్ యార్డు ఇలా ఎన్నో. ముఖ్యంగా ఇన్నేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టింది. వెలుగోడు రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. నిధుల మంజూరు, పనుల్లో వేగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతోనే పనులు చివరి దశకు చేరుకున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

- నంద్యాలకు తీరనున్న నీటి సమస్య
- రూ.137.34 కోట్లతో పనులు
- ‘వెలుగోడు’ నుంచి 34.34 కి.మీ.మేర పైప్‌లైన్
- అదనంగా రూ.19.81 కోట్లు ఖర్చు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఫ్లోటింగ్ పంప్ హౌస్‌కు రూ.41 లక్షలు వెచ్చించనున్న మున్సిపాలిటీ

నంద్యాల(సిటీ): నంద్యాల ప్రజల చిరకాల వాంఛగా మిగిలిన తాగునీటి సమస్యను తీర్చి ప్రతి ఇంటికీ ‘అమృత ధార’లు కురిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అమృత్ (అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్) పథకం కింద సెంట్రల్ పబ్లిక్ హెల్త్(సీపీహెచ్), ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ ఆర్గనైజేషన్‌ల నిబంధనల మేరకు ఈ ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశారు. ఇంకా 1.34 కి.మీ. మేర పనులు పెండింగ్‌లో ఉండగా మరో ఆరు నెలల్లో పూర్తి చేయనున్నారు. అయితే ఇందుకు సమాంతరంగా ప్రభుత్వం చొరవతో పట్టణానికి నీటి ఎద్దడి ఏర్పడకుండా కేసీ కెనాల్ నుంచి 15 ఎంఎల్‌డీ నీరు లిఫ్ట్ చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ద్వారా పట్టణానికి అందిస్తున్నారు. ఈ విధానంతో అదనంగా రూ.41 లక్షలు మున్సిపల్ సాధారణ నిధులను వెచ్చించనున్నారు. పట్టణానికి పూర్తిగా నీటిని అందించేందుకు వివిధ రకాలుగా పైప్‌లైన్‌లను మరమ్మతులు చేసి అమృత్ పైప్‌లైన్‌లను ఇప్పటికే సాధారణ పైప్ లైన్‌లకు అనుసంధానం చేశారు.

రూ. 137.34 కోట్లతో అంచనా..

అర్బన్ ప్రాంతాల్లో తాగు నీటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నంద్యాల మున్సిపాలిటీ నిర్మిస్తున్న అతి పెద్ద పథకంగా చెప్పవచ్చు. ఈ పథకం ముందుగా రూ.137.34 కోట్ల అంచనాతో నిర్మాణానికి అనుమతులు పొందగా పలు కారణాల రీత్యా మరో రూ.19.81 కోట్ల మేర నిధులు అదనంగా వెచ్చించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. అంటే గరిష్ఠంగా రూ.157.15 కోట్లు వెచ్చించనున్నారు. అయితే ఇప్పటికే ఈ పథకం 90 శాతం పూర్తయ్యింది, మిగిలిన పదిశాతం మేర పనులు చేసేందుకు క్వాలిటీ కంట్రోల్ (క్యూసీ) వద్ద పర్యవేక్షణలో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నాణ్యతా ప్రమాణాల రీత్యా అనుమతులు రాగానే పూర్తి స్థాయిలో పథకాన్ని మొదలు పెట్టనున్నారు. రూ.137.34 కోట్లలో కేంద్ర ప్రభుత్వ వాటా కింద 29.3 శాతం అంటే రూ.40.24 కోట్లు, రాష్ట్రం వాటా 11.58 శాతం అంటే రూ.15.90 కోట్లు, యూఎల్బీ (అర్బన్ లోకల్ బాడీస్) వాటా 59.09 శాతం అంటే రూ.81.15 కోట్లు వెరసి రూ.137.34 కోట్లతో ఈ పథకాన్ని పూర్తి చేయనున్నారు.



పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు (ఫైల్)

అదనంగా రూ.19.81 కోట్లు చెల్లించనున్న రాష్ట్ర ప్రభుత్వం..

అంచనాలకు మించి పనులు సాగుతున్నందున ఈ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించేందుకు అడుగులు వేసింది. ఇందుకు అంచనా వ్యయం రూ.137.34 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.19.81 కోట్లు వెచ్చిస్తుంది. ఈ రూ.19.81 కోట్లలో ఫ్లెక్సిబుల్ పైప్ లైన్‌ల నిర్మాణం కోసం రూ.8 కోట్లు ఖర్చవగా, రూ.11.81 కోట్లు జీఎస్టీ, వ్యాట్ తేడాల్లో చెల్లింపులకు వినియోగిస్తున్నారు. ఈ మొత్తాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం హర్షనీయం.

2.60 లక్షల జనాభాకు..

జిల్లా కేంద్రమైనందున పట్టణంలో జనాభా రోజు రోజుకూ పెరుగుతోంది. పట్టణంలో వ్యాపార, విద్య, ఇతర అవసరాల కోసం అదనంగా జనాభా పెరుగుతున్న నేపథ్యంలో 2.60లక్షల మందికి అవసరమైన నీటిని అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రానున్న 30 సంవత్సరాలను దృష్టిలో ఉంచుకుని అమృత్ పథకాన్ని సిద్ధం చేస్తున్నారు. పట్టణంలో ఉన్న 25 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) స్టోరేజ్ పంప్ హౌస్‌తో పాటు 4ఎంఎల్‌డీ కెపాసిటీ కలిగిన ట్యాంకులు అందుబాటులోకి తీసుకురానున్నారు. పట్టణంలో 31,890 కుళాయి కనెక్షన్లు ఉండగా మరో 4,638 కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పట్టణంలోని అమృత్ పైప్ లైన్‌లు డిస్ట్రిబ్యూషన్ ఛానల్ 194 కి.మీ.మేర ఉండగా నెట్‌వర్క్ పైప్‌లైన్‌ల కింద మరో 48.9 కి.మీ. మేర ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అమృత్ పథకానికి నిధుల కేటాయింపుల వివరాలు..

పైప్‌లైన్ దూరం	34.34 కి.మీ
నంద్యాల జనాభా	2.60 లక్షలు
కేంద్రం వాటా	రూ.40.24కోట్లు (29.3శాతం)
రాష్ట్రం వాటా	రూ.15.90కోట్లు (11.58శాతం)
యూఎల్బీవాటా	రూ.81.15కోట్లు (59.09శాతం)
అంచనా వ్యయం (ప్రస్తుత ఖర్చు)	రూ.137.34కోట్లు
అదనపు ఖర్చు (రాష్ట్రప్రభుత్వం)	రూ.19.81కోట్లు
మొత్తం	రూ.157.15 కోట్లు

రూ. 65 లక్షలతో నిరంతరాయంగా నీటి విడుదల..

కేసీ కెనాల్ నుంచి 15 ఎంఎల్‌డీ నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు లిఫ్ట్ చేస్తారు. ఈ నీటిని పట్టణ ప్రజలకు అందించేందుకు డెడికేటెడ్ పవర్ లైన్‌ను రూ.65లక్షలతో అధికారులు సిద్ధం చేశారు. ఈ లైన్ వల్ల విద్యుత్ కోత వల్ల వచ్చే అంతరాయాన్ని అధిగమించవచ్చు. ఈ లైన్ లేకపోతే నీరు రోజు మార్చి రోజు వస్తున్నందున ఏదైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే ఒక ప్రాంతానికి ఇవ్వాల్సిన నీరు 6 రోజులకు పైగా వాయిదా పడే అవకాశముంది. ఈ ఇబ్బందులకు స్వస్తి పలికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో డెడికేటెడ్ పవర్‌లైన్ ద్వారా ప్రజలకు నీరు అందిస్తున్నారు.



వెలుగోడులో ఫాంటూన్ ఫ్లోటింగ్ పంప్ హౌస్ పనులకు సామగ్రిని తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

పట్టణానికి నీటి ఎద్దడిరాకుండా చర్యలు చేపడతాం



పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపడుతున్నాం. అమృత్ పథకం పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయి. త్వరలోనే పూర్తి చేసి పట్టణంలో ప్రతి ఇంటికీ పుష్కలంగా తాగునీరు అందిస్తాం. ఇప్పటికే పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ట్రయల్ రన్ నిర్వహించాం. అమృత్ సంపూర్ణంగా పూర్తయితే రానున్న 30 సంవత్సరాల పాటు పట్టణానికి నీటి కొరత ఉండదు. పట్టణానికి సమ్మర్‌స్టోరేజీ నుంచి నీటిని వదులుతున్నాం. అలాగే కేసీ కెనాల్ నుంచి మరో 15 ఎంఎల్‌డీ నీరు అందిస్తున్నాం.

– రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల

ఫాంటూన్ ఫ్లోటింగ్ పంప్ హౌస్..

అత్యంత ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వెలు గోడు రిజర్వాయర్‌లో ఫాంటూన్ ఫ్లోటింగ్ పంప్ హౌస్‌ను ఏర్పాటు చేయనున్నారు. వెలుగోడులో నిర్మించే ఇన్‌టేక్‌వెల్ నిర్మాణం వల్ల రిజర్వాయర్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ రూపకల్పనలో ఈ తరహా ప్రపోజల్ లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే రిజర్వాయర్‌కు ఎటువంటి హాని జరగకుండా ఉత్తర భారతదేశంలో ఉపయోగిస్తున్న ఈ టెక్నాలజీని ఇక్కడ వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు అదనంగా రూ.41లక్షలు మున్సిపాలిటీ నిధుల నుంచి వెచ్చించనున్నారు.

క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: రక్తదానం చేసి ప్రాణాపాయంలో ఉన్న వారి ప్రాణాలు నిలపాలని శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీ రీజినల్ హెడ్ ప్రసాద్ కోరారు. కంపెనీ స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్థానిక కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 60 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కంపెనీ ప్రతినిధులు చంద్రమోహన్, అయూబ్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

గోస్పాడు: మొక్కల పెంపకం కాలుష్య నివారణకు దోహద పడుతుందని వ్యవసాయ కళాశాల డీన్ శివశంకర్ నాయక్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ నారాయణరావు తెలిపారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో బుధవారం వ్యవసాయ విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం – వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల, విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు.. డాక్టర్లు మల్లేశ్వర్‌రెడ్డి, ఫరీదా, పీడీ యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



బార్‌లోని మద్యం బాటిల్ నుంచి నమూనాలు సేకరిస్తున్న రవికుమార్‌రెడ్డి

బొమ్మలసత్రం: బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. నంద్యాల పట్టణ పరిధిలోని పలు బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు దుకాణాలను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో ఉన్న మద్యం బాటిళ్ల నుంచి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని తెలిపారు. కల్తీ చేసినట్లు నిర్ధారణ అయితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో అధికారులు అస్లాం బేగ్, లక్ష్మి సిబ్బంది సుబ్బయ్య, కల్పన ఉన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

ఆళ్లగడ్డ: మండలంలో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని హెచ్ఎంలకు డీఈఓ అనురాధ సూచించారు. కోటకందుకూరులోని జెడ్పీ హైస్కూల్, అంగన్వాడీ కేంద్రం-3లో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. 3, 9వ తరగతి విద్యార్థులకు అందజేసిన నోట్ బుక్స్, వర్క్‌బుక్స్, లెసన్‌ప్లాన్‌లను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యాప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓ శోభావివేకవతి ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో రోజు వారి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం 2,500 కూలీలకు రోజూ పనులు చూపాలని లక్ష్యంగా నిర్దేశించిందని, అయితే కేవలం 960 మంది మాత్రమే పనులల్లో పాల్గొనడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీకి రోజు వారి వేతనం ప్రభుత్వం రూ. 272 పెంచిందని ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయిలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు అవగాహన కల్పించి పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి

నంద్యాల(అర్బన్): 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరెడ్డి కోరారు. ఏపీజేఏసీ అమరావతి మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఏపీజేఏసీ నాయకులు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ రామచంద్రారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మంచి చేసినందునే ఇంటింటికీ వెళ్తున్నాం



పొదుపు మహిళలకు ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రజలకు మంచి చేస్తున్నందునే గర్వంగా, ధైర్యంగా ఇంటింటికీ తిరిగి వారిని కలుస్తున్నామని, టీడీపీకి ఆ ధైర్యం ఉందా అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకే సీఎం జగనన్న పథకాలు అమలు చేస్తున్నారని, అలాంటి విశ్వసనీయత మీ పార్టీ అధినేత చంద్రబాబు ఉందా, కనీసం ఎన్నికల మేనిఫెస్టో ఆన్‌లైన్‌లో ఉంచకుండా తొలగించిన మీరా.. మా పథకాల అమలు గురించి మాట్లాడేది అంటూ ఎద్దేవా చేశారు. బుధవారం చాగలమర్రిలోని మండల పరిషత్ కార్యలయ ఆవరణలో 3వ విడత ఆసరా కార్యక్రమం ప్రారంభిచారు. ఈ సందర్భంగా 318 పొదుపు సంఘాలకు మాఫీ అయిన రూ.1.63 కోట్ల చెక్కును మహిళలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో అక్రమాలు చోటు చేసుకోకూడదని, అవినీతి అస్సలుండకూడదని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమచేయడం మా నాయకుడి నిబద్ధతను చాటుతుందన్నారు. గత ప్రభుత్వం ఏ చిన్న పథకం లబ్ధి చేకురాలన్నా..కింది స్థాయి జన్మభూమి కమిటీ నుంచి ప్రజాప్రతినిధుల వరకు చేతులు తడపాల్సి వచ్చేదని, అంతేగాక.. వారి ఇళ్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. నేటి జగనన్న పాలన ఎలా ఉందో.. ఏ పల్లెలో అడిగినా చెబుతారని, కేవలం అర్హత ఉంటే చాలు పథకాలు అందుతాయని చెప్పారు. అందుకే ఇన్ని కోట్ల మంది అర్హులయ్యారని, వీరంతా టీడీపీ పాలనలో కూడా ఉన్నారు..కదా..మరి.. నాడెందుకు పథకాలు అందలేదని సూటిగా ప్రశ్నించారు. అంటే నాయకుడికి చిత్తశుద్ధి ఉండాలని, అప్పుడే పేదలందరికీ పథకాలు అందుతాయని, అదే నేడు జరుతోందని, తేడాను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తులశమ్మ, రాష్ట్ర అయిల్ ఫెడరేషన్ చైర్మన్ గౌసియాబేగం, రాష్ట్ర మహిళ ఆర్థిక సాధికార సంస్థ డైరెక్టర్ శ్రీవిద్య, ఎంపీపీ వీరభద్రుడు, జెడ్పీటీసీ లక్ష్మిదేవి, మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ రఫీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఐకేపీ ఏసీ దానం, ఏపీఎం నాగమ్మ, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ పత్తి నారాయణ, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, తహసీల్దార్ విజయకుమార్ పాల్గొన్నారు.

అవినీతి లేకుండా పథకాల అమలు



మద్దూరులో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల



వృద్ధుడితో మాట్లాడుతున్న నాయకులు

ఆళ్లగడ్డ: నవరత్నాలు పథకాల అమలులో పైసా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమచేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం చాగమలర్రి మండలం మద్దూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి పథకాలు, లబ్ధిని వివరించారు. గతంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని, అది కూడా అమలుకు కొంత చేతికి ముట్టజెప్పాల్సి వచ్చేదని, నేడు అలా కాకుండా అర్హలని తేలితే ఎవరి ప్రమేయం లేకుండా నేరుగా పథకం అందజేస్తున్నామని చెప్పారు. ఒక్క రోజులో అభివృద్ధి సాధ్యం కాదని, ఇది నిరంతర ప్రక్రియన్నారు. ఇప్పటికే గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, బల్కమిల్క్ సెంటర్స్ తదితర భవనాలను నిర్మించి సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంపీపీ వీరభద్రుడు, పార్టీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు పత్తి నారాయణ, బేబమ్మ, నాయకులు మద్దం శెట్టి దస్తగిరి, శివప్రసాద్, లక్ష్మినారాయణ, దండు హరినారాయణ, సుబ్బరాయుడు, మాబు, షరీఫ్ పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్

దొర్నిపాడు: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. బుధవారం గుండుపాపల, చాకరాజువేముల, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, గ్రామాల్లో ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, మండల కనీనర్ శివారెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరారవు, జెడ్పీటీసీ శకుంతల ఆధ్వర్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు, గత ప్రభుత్వాల పాలన తీరు, నేడు జగనన్న పాలన తీరుకు గల తేడాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వివరించి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. వారి అనుమతితో ఇళ్ల స్టిక్కర్లు అతికించి, మద్దతు తెలిపిన వారితో మిస్డ్ కాల్ ఇప్పిస్తున్నారు. కన్వీనర్లు శ్రీలక్ష్మి, జక్కుల రాముడు, నాగేష్, హుసేన్‌బాషా, లక్ష్మిపార్వతి, వాసు, మైనుద్దీన్, కాకర్ల మోహన్‌నాయుడు, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మంచి జరిగి ఉంటేనే జగనన్నకు మద్దతు తెలపాలని గోవిందపల్లె గ్రామ సచివాలయ కన్వీనర్ వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి కోరారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి గతానికి నేటికీ ఉన్న పాలన తేడాలను వివరించి పథకాలు, జగనన్న పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అలాగే కామినేనిపల్లె సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి తన గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వీరారెడ్డిపల్లెలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు మందాల రాధిక, సర్పంచు శివారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఉప సర్పంచులు శేషారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు



అదామా సీఈఓను సన్మానిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా



కానాలలో మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్):నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కానాల గ్రామంలో గ్రామ నాయకులు విజయశేఖర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందజేసిన పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. పలువురు ప్రస్తావించిన సమస్యలపై పరిష్కరించాలని అక్కడేనున్న అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును చూసి ప్రతి పక్షాలు జీర్ణించుకోలేక విమర్శలకు పాల్పడుతున్నాయన్నారు. నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, సర్పంచ్ బావమ్మ, ఎంపీటీసీ రంగారావు, దూదేకుల ఖాసీం, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి

నంద్యాల(సిటీ): సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన అదామా ఆడిటోరియాన్ని ఆ సంస్థ సీఈఓ సాహిన్ ఓజ్కాన్‌తో కలిసి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో అదామా సంస్థ సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. సాహిన్ ఓజ్కాన్ మాట్లాడుతూ విద్య ఔన్నత్యాన్ని పెంపొందిస్తుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, అదామా సొతిండియా హెడ్ పాపునాయడు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, కళాశాల స్థల దాతలు పసుపుల లక్ష్మీనారాయణ శెట్టి, కసెట్టి కృష్ణమూర్తి, సంస్థ జీఎం సతీష్‌లింగారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు

- మొదటి స్థానంలో పెద్దకొట్టాల ఎద్దులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: పునరుత్థాన పండగ సందర్భంగా సాంబవరం గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలు బుధవారం ముగిశాయి. న్యూ కేటగిరి విభాగంలో జరిగిన ఎద్దుల బండలాగుడు పోటీలను నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పండుగల సందర్భంగా సంప్రదాయం ప్రతిబింబించేలా బండలాగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులను, యువకులను ఉత్సాహపరుస్తూ ఐకమత్యంగా మెలిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పోటీల్లో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు మొదటి బహుమతిగా రూ.50వేలు, వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ ఎద్దులు ద్వితీయ బహుమతిగా రూ.40వేలు, నంద్యాల జిల్లా చిన్న కానాలకు చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు తృతీయ బహుమతిగా రూ.30వేలు, నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన రవితేజేశ్వరరెడ్డి ఎద్దులు నాల్గో బహుమతిగా రూ.20వేలు, నంద్యాల జిల్లా వణికెనిదిన్నె గ్రామానికి చెందిన తలారి రామానాయుడు బ్రదర్స్ ఎద్దులు ఐదో స్థానంలో నిలిచి రూ.10వేలు, నంద్యాల జిల్లా రేగడగూడూరుకు చెందిన వెంకటరామిరెడ్డి ఎద్దులు ఆరు బహుమతి రూ.5వేల నగదు గెలుపొందాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఐజయ్య, ఎంపీటీసీ భారతి, నాయకులు డాక్టర్ జూపల్లె రాకేష్‌రెడ్డి, బోరెడ్డి గోపాల్‌రెడ్డి, బోరెడ్డి శంకర్‌రెడ్డి, క్రైస్తవ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల: పాత్రికేయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆర్థర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏపీడబ్ల్యూజే నూతన జిల్లా కమిటీ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా మాజీ కన్వీనర్ శ్యాంసుందర్‌లాల్, ఎమ్మెల్యేలు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నంద్యాలలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు, జర్నలిస్టులకు నూతన గృహాలు, అక్రిడేషన్లు తదితర సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు.

జిల్లా నూతన కమిటీ..

ఏపీయుడబ్లుజే జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మధుబాబు, ప్రధాన కార్యదర్శిగా ఉస్మాన్, ఉపాధ్యక్షులుగా బాల మద్దిలేటి, శ్యామ్, రామదాసు, మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు గౌరవాధ్యక్షుడిగా జనార్దన్ రెడ్డి, గౌరవ సలహాదారుడిగా కనకరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సాయివర్మ, సహాయ కార్యదర్శిగా రమణ, రామాంజనేయులు, జావీద్, కోశాధికారిగా మద్దిలేటి, కార్యవర్గసభ్యులుగా బాలు, మహేష్, రవికుమార్, పరమేష్, బాలకృష్ణ, శ్రీనివాసులు, నారాయణ, రఘురామయ్య, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, విజయ్, శేఖర్ రెడ్డి, నాగమణి, బ్రహ్మం, ఇస్మాయిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఐకమత్యంతో మెలుగుదాం

నంద్యాల(అర్బన్): కుల మతాలకు అతీతంగా పండుగలు నిర్వహించుకుంటూ ఐకమత్యంతో సాగుదామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇఫ్తార్ విందు ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని చాంద్‌బాడ, నడిగడ్డ ప్రాంతాల్లోని బదర్ మజీద్, కిజర్ మజీద్‌ల ఆవరణల్లో నిర్వహించిన ఇఫ్తార్ విందుల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కౌన్సిలర్లు ఆరిఫ్, తమీమ్, కో ఆప్షన్ మెంబర్లు సలాముల్లా, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుసేన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి

అవగాహన లేకుండా ఆరోపణలా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆళ్లగడ్డ: పట్టణంలో ఏం జరుగుతుందో కనీసం అవగాహన లేకుండా మాజీ మంత్రి అఖిలప్రియ ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైద్యశాల ముందు దుకాణాల ఏర్పాటులో ఎవరి వద్ద ఒక్క రూపాయి తీసుకోవాల్సిన అవసరం గంగుల కుటుంబానికి లేదన్నారు. గంగుల హయాంలోనే 50 పడకల వైద్యశాలను నిర్మించామని, ఇక్కడ ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తొలగించి మరో చోట ఏర్పాటు చేయడంతో వైద్యశాలకు స్థలం కొరత తీరిందన్నారు. మీ హయంలో స్థలం చూపక పోడంతో వైద్యశాల నిర్మాణం రద్దయిందనేది మరిచిపోయారా అన్ని ప్రశ్నించారు. మంత్రి పదవి నిర్వహించిన వారికి వైద్యశాల నిర్మాణంపై అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. తొలి విడతలో రూ.3కోట్లతో వైద్యశాల పనులు చేశారని, రెండో విడత పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఆరోపణాలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డి.వనిపెంట బ్రిడ్జి, 50 పడకల వైద్యశాల, అహోబిలం రోడ్డు, అర్బన్ హెల్త్ సెంటర్, పూలే గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, గండ్లేరు నుంచి శాశ్వత నీటి పరిష్కారం, జి.జంబులదిన్నె, నందింపల్లె వంతెన నిర్మాణ వంటి పనులన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే చేశారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కూలూరు నరసింహారెడ్డి, డాక్టర్ శీలం సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

జీఓ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి తెచ్చేందుకు విడుదల చేసిన జీఓ 52 వెంటనే రద్దు చేయాలని ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలానాయక్ కోరారు. జీఓ రద్దుపై ప్రభుత్వానికి నివేదికలు పంపాలంటూ బుధవారం నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.